సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం ౹ 8 ౹ జూలై ౹ 2023



పశుగ్రాస వారోత్సవాలు


ద్వారకాతిరుమల: పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు ఎ.రామచంద్రరావు ఆధ్వర్యంలో గుణ్ణంపల్లి పంచాయతీ తక్కెళ్లపాడులో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు.



చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

దెందులూరు: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ ఆశ అన్నారు. విజయరాయి శివారు ముత్తనవీడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు.

విశేష అలంకరణ



పెనుమంట్ర: పెనుమంట్ర ఊరచెరువుగట్టు వద్ద లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారిని కూరగాయలతో విశేషంగా అలంకరించారు. సంకట హర చతుర్థిని పురస్కరించుకుని రాష్ట్ర వీఆర్వోల సంఘ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ముందస్తు ఎన్నికలుండవు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



కొఠాలపర్రులో సర్టిఫికెట్లు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతిపక్షాలు హడావుడి చేస్తున్నట్టు ఎటువంటి ముందస్తు ఎన్నికలు ఉండవని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పెనుగొండ, కొఠాలపర్రు గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలంటే ప్రతిపక్ష నాయకులు హడలిపోతున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం జగన్ సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీలో ఏ ఒక్క నాయకుడూ ఎన్నికలకు భయపడే పరిస్థితి లేదని, రానున్నది సీఎం జగన్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమాన్ని అందుకున్న ప్రతి మహిళా సీఎం జగన్‌కు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు కుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కులం, సంఘాలతో వెలి వేయడాలు, కక్ష సాధింపులు చేస్తున్నారని, అయినా ఏ ఒక్కరూ భయపడటం లేదన్నారు. పెనుగొండలో కమ్యూనిటీ భవనానికి స్థల కేటాయింపులకు ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని, ఇది సమంజసం కాదన్నారు. వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, కొఠాలపర్రు సర్పంచ్ గంధం శ్రీదేవి, విద్య, వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవరెడ్డి, రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, మండల కన్వీనర్లు నలిమిల్లి బాబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు కిసాన్ కార్డులు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): పాడి రైతులకు పశు కిసాన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆమె డీఆర్‌డీఏ, పశు సంవర్ధక శాఖ, బ్యాంకు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమూల్‌పై సమీక్షించారు. చేయూత లబ్ధిదారుల వద్ద పశువులు, అమూల్‌కు ఎంత మంది పాలు పోస్తున్నారనే విషయాలపై తనిఖీ చేయాలన్నారు. నరసాపురం, యలమంచిలి, తాడేపల్లిగూడెంలో అమూల్ కేంద్రాలకు పాలుపోసే రైతులకు వర్కింగ్ క్యాపిటల్, కొత్తగా పశువుల కొనుగోలుకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెంలో 10, యలమంచిలి, నరసాపురం, పాలకొల్లులో ఏడు చొప్పున మొత్తం 31 అమూల్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, ప్రస్తుతం 940 మంది రైతులు రోజుకు 3,112 లీటర్ల పాలను అందజేస్తున్నట్టు చెప్పారు. పాల సేకరణ మరింత పెరగాలన్నారు.

డాక్టర్ జీఆర్ రెడ్డికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ జీఆర్ రెడ్డి

తాడేపల్లిగూడెం: భాగ్యనగర్ టాస్కాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన గ్లకోమా సదస్సులో తాడేపల్లిగూడేనికి చెందిన నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జీఆర్ రెడ్డికి జాతీయ అవార్డు అందుకున్నారు. డాక్టర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్లకోమా చికిత్స విధానాలు, నివారణ మార్గాల గురించి మాట్లాడారు. అనంతరం డాక్టర్ ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ చేతులమీదుగా జాతీయ అవార్డును తెలంగాణ అసోసియేషన్ తరపున డాక్టర్ రెడ్డికి అందజేశారు. రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

గాంధీ భవనం.. సందర్శనకు సిద్ధం

సాక్షి, భీమవరం: ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలనులో మహాత్మా గాంధీ భవనాన్ని పర్యాటకుల సందర్శనకు సిద్ధం చేసినట్లు జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వోదయ నాయకుడు చింతలపాటి వరప్రసాదమూర్తి పార్లమెంట్ నమూనాలో గాంధీ మ్యూజియం ఏర్పాటుచేశారన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భవనాన్ని సందర్శించవచ్చని పేర్కొన్నారు.

అపర భగీరథ.. అందుకో మా జోత

నేడు దివంగత నేత వైఎస్సార్ జయంతి



అన్నదాతల సంక్షేమమే లక్ష్యం..

వ్యవసాయాన్ని పండుగ చేయాలనే సంకల్పం.. ప్రతి ఎకరాకు నీరందించాలనే కృతనిశ్చయం.. కీలక ప్రాజెక్టులకు బీజం వేసింది.. వందల కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాలు.. గిరిజనులకు పోడు భూముల పంపిణీ.. ఉచిత విద్యుత్‌తో సస్యశ్యామలమైన మెట్ట భూములు.. ఉద్యాన విద్యతో పాటు పరిశోధనలకు ఊతమిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం.. అడుగడుగునా ఆయన గురుతులతో మదిమదిలో.. జనహృదిలో చెరగని స్థానం పొందారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. శనివారం ఆయన జయంతి సందర్భంగా మహానేత.. అందుకో మా జోత అంటూ జిల్లా ప్రజలు నివాళులర్పిస్తున్నారు.

మహానేతా.. మనసాస్మరామి


- సుస్థిర అభివృద్ధికి బీజం
- వ్యవసాయానికి పెద్దపీట
- ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యం
- వర్సిటీల స్థాపనతో వేలాది మందికి విద్య
- జిల్లాతో వైఎస్సార్‌కు విడదీయరాని బంధం





పోలవరం ప్రాజెక్టు, (ఇన్‌సెట్‌లో) వెంకట్రామన్నగూడెంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, ఏలూరు : మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి 'పశ్చిమ'ను సస్యశ్యామలం చేయాలని పరితపించారు. జిల్లాకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా సమగ్రాభివృద్ధికి కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తూ పూర్తిస్థాయిలో సాగునీటి అవసరాలను తీర్చారు. ఏలూరు నగరాభివృద్ధి మొదలు పోలవరం ప్రాజెక్టు వరకు అన్ని కీలక ప్రాజెక్టులకు వైఎస్సార్ హయాంలోనే బీజం పడింది. వందల కోట్ల వ్యయంతో చేపట్టిన ఎత్తిపోతల పథకాలు, గిరిజనులకు సాగుహక్కు కల్పిస్తూ పోడుభూముల పంపిణీ, జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపచేసేలా ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటు ఇలా పదుల సంఖ్యలో కీలక ప్రాజెక్టులతో జిల్లా రూపురేఖలు మార్చారు. వైఎస్సార్ హయాంలో అంకురార్పరణ జరిగిన పోలవరం ప్రాజెక్టు పనులు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్ జయంతిని ప్రభుత్వం రైతు దినోత్సవంగా నిర్వహిస్తోంది. శనివారం పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే రైతులకు పంట నష్టపరిహారాన్ని విడుదల చేయడంతో పాటు అగ్రిల్యాబ్‌లను ప్రారంభించనున్నారు.



నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణం

రాష్ట్రానికే పోల'వరం'

జిల్లా ప్రజల చిరకాల స్వప్నం పోలవరం ప్రాజెక్టుకు 2004లో రూ.10,151 కోట్ల వ్యయంతో వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. ఎడమ, కుడికాల్వ ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసం ఇలా పనులను విభజించి వేగవంతం చేశారు. ఆయన హయాంలో 60 శాతానికి పైగా కుడి, ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టులో స్పిల్ కాంక్రీట్ పనులు పూర్తి చేయడం, 48 రేడియల్ గేట్ల ఏర్పాటు, రివర్స్ స్లూయిజ్ గేట్ల నిర్మాణం, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పూర్తి, గ్యాప్-3 వద్ద కాంక్రీట్ పనులు, పవర్ హౌస్‌లో సొరంగం తవ్వకాలు, అప్రోచ్ చానల్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టును కీలక పురోగతికి తీసుకువచ్చారు. దీంతో పాటు 12,658 కుటుంబాలను తరలించి పునరావాసం పూర్తిస్థాయిలో కల్పించారు.

లక్షల ఎకరాలకు నీరందించేలా 'చింతలపూడి'

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి 2008 అక్టోబరు 30న కామవరపుకోటలో వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు ప్రారంభించి కాలువ నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే ఆయన మరణం అనంతరం వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. మరలా 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పట్టాలెక్కాయి. ఏటా ఆర్థిక బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు నాబార్డు రుణం ద్వారా ప్రాజెక్టును పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడంతో పాటు కొత్తగా 2.10 లక్షల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

'ఉద్యాన' వెలుగులు

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో దేశంలో రెండోదిగా, దక్షిణ భారతదేశంలో మొదటిగా ఉద్యాన యూనివర్సిటీకి వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. నూజివీడులో 120 ఎకరాల విస్తీర్ణంలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఆయన హయాంలోనే ప్రారంభమైంది. ఇక ఆపరేషన్ కొల్లేరు సమయంలో కొల్లేరు వాసులకు అండగా నిలిచారు. కృష్ణా, పశ్చిమగోదావరి ప్రాంతంలో ఉన్న కొల్లేరుకు సంబంధించి రూ.3,500 కోట్ల ప్రత్యేక పునరావాస ప్యాకేజీని ప్రకటించి కొల్లేరువాసులను ఆదుకున్నారు. ఏలూరు నగరానికి వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపేలా తమ్మిలేరుకు రెండువైపులా రూ.90 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి వైఎస్సార్ శ్రీకారం చుట్టగా నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 95 శాతం పనులు పూర్తయ్యాయి.

అడవి బిడ్డలకు అండగా..

- రూ.58 కోట్లతో కొవ్వాడ కాలువలపై ఔట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మాణం, రూ.26 కోట్లతో పొగొండ రిజర్వాయర్‌ను నిర్మించి బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో 7,500 ఎకరాలకు సాగునీరందించిన ఘనత వైఎస్సార్‌దే.
- కొండ కాలువల వద్ద రూ.26 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలను సులభం చేశారు.
- 4,500 ఎకరాల పోడు భూములను 2,200 మంది గిరిజనులకు పంపిణీ చేసి సాగుదిశగా ప్రోత్సహించారు. ప్రస్తుతం ఆ భూముల్లో మొక్కజొన్న, వరి, పొగాకు సాగవుతున్నాయి.
- వైఎస్సార్ బాటలోనే సీఎం జగన్ కూడా 3,500 ఎకరాల పోడు భూములను 2,700 మంది గిరిజనులకు పంపిణీ చేయడంతో పాటు 350 ఉచిత బోర్లు ఏర్పాటుచేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలిలో జగనన్న అమ్మఒడి చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక

అత్తిలి: విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాల, ఇరగవరం జెడ్పీ హైస్కూళ్లలో నాలుగో విడత జగనన్న అమ్మఒడి భాగంగా ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందించారు. అత్తిలిలో ఆయన మాట్లాడుతూ అమ్మఒడి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తోందని, అత్తిలి మండలంలో తల్లుల ఖాతాల్లో సుమారు రూ.7 కోట్ల నగదు జమచేశామన్నారు. ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ 17 మెడికల్ కళాశాలలు తీసుకువచ్చారన్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడితే చంద్రబాబు వ్యతిరేకించారని విమర్శించారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని భావించిన సీఎం జగన్ తీసుకువచ్చిన విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి మరో ముందడుగు వేశారన్నారు. అనంతరం మండల విద్యాశాఖ తరపున మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకీ, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్లు కూనపరెడ్డి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు ఆడంబరంగా ఆషాఢ సారె



భీమవరంలో సారె తీసుకువస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): సిరుల తల్లి.. కల్పవల్లి.. భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి అమ్మవారికి సారె సమర్పించారు. త్యాగరాజు భవనం నుంచి అమ్మవారి దేవస్థానం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా సారె తీసుకువచ్చారు. ఆలయం వద్ద మంత్రి దంపతులు, ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజాదికాలు నిర్వహించి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సనాతన ధర్మం కాపాడాలని, ధర్మం నిలబడాలని, రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ధర్మ పరిపాలన చేస్తున్నామన్నారు. రాష్ట్రంపై అమ్మవారి కరుణాకటాక్షాలు మెండుగా ఉండాలని, సకాలంలో వర్షాలు పడాలని, పంటలు బాగా పండి రైతులు, ప్రజలు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ ఆషాఢ సారె సమర్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్ల ఆలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ మావుళ్లమ్మకు సారె సమర్పించడం చాలా ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దేవదాయశాఖ ఆర్‌జేసీ ఈ.సురేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ జయరాజు, ఆర్డీఓ దాసి రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, దేవస్థానం సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, పంచారామ క్షేత్రం చైర్మన్ కోడే విజయలక్ష్మి, మావుళ్లమ్మ దేవస్థానం ధర్మకర్తలు మావూరి సుందరరావు, ముత్యాల రామారావు, చెల్లంకి గిరి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కొయ్య వెంకటలక్ష్మి, రామాయణం సత్యనారాయణ, కోడే యుగంధర్, ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, ధార్మిక పరిషత్ సభ్యులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, మంతెన రామ్‌కుమార్ రాజు, పార్టీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

'మహో' నివాళి









అగ్గిపుల్లపై మహానేత ఇన్‌సెట్‌లో ఆర్టిస్ట్ సురేష్‌బాబు

రావి ఆకుపై వైఎస్సార్ చిత్రం ఇన్‌సెట్‌లో ఆర్టిస్ట్ శివప్రసాద్

ఏలూరు (టూటౌన్): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారులు ఘన నివాళులర్పించారు. రావి ఆకుపై వైఎస్సార్ చిత్రం గీయడంతో పాటు 200 బియ్యపు గింజలపై వైఎస్సార్ అనే పేరును చెక్కి అభిమానాన్ని చాటారు సూక్ష్మ కళాకారుడు దొర శివప్రసాద్. అలాగే అగ్గిపుల్లలపై వైఎస్సార్, సీఎం జగన్ చిత్రాలను చెక్కి భళా అనిపిస్తున్నారు మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్‌బాబు. ఈ సందర్భంగా సూక్ష్మ కళాకారులు శివప్రసాద్, సురేష్ బాబు మాట్లాడుతూ వైఎస్సార్‌పై తమకున్న అభిమానంతో ఇలా నివాళులర్పిస్తున్నామని, ఆయన రూపొందించిన ఆరోగ్య, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు.

సీఎం ప్రతి కార్యక్రమానికీ భగవంతుని ఆశీస్సులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దైవభక్తిపరాయణుడని, ఆయన తలపెట్టిన ప్రతి కార్యక్రమానికీ భగవంతుని ఆశీస్సులు ఉన్నాయని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం దేశంలో ఎప్పుడూ జరగని విధంగా మహాయజ్ఞం చేశామని, దాని ఫలితంగానే రాష్ట్రానికి నిధులు వరదలా వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయంటూ కొన్ని పార్టీలు హడావుడి పడిపోతున్నాయని, ఎన్నికలు జరగాల్సిన సమయానికే జరుగుతాయని స్పష్టం చేశారు. అధర్మాన్ని ఆచరించి ధర్మాన్ని తొక్కేసి పాలన చేసిన వ్యక్తి నోటికొచ్చినట్టు తనకున్న పచ్చ మీడియా ద్వారా ప్రజల మనసును విషపూరితం చేయాలని ప్రయత్నిస్తున్నాడని, అలాంటి వ్యక్తికి వత్తాసు పలుకుతూ అమ్మవారి పేరుతో ఉన్న వాహనం ఎక్కి అసత్యాలు పలుకుతున్న దుర్మార్గుడైన చంద్రబాబు కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రయత్నాలు ఏ రకంగానూ ఫలించవని తెలిపారు. అధర్మాన్ని ఆశ్రయించి మాట్లాడే మాటలు ఏ రకంగా అమ్మవారు సహిస్తుందో పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలన్నారు. వారాహి దేవి అనుగ్రహం కలగాలంటే నువ్వు ధర్మం పక్షం వహించు, చంద్రబాబును వదిలేసి నీ సొంత ఆలోచనలతో, ప్రజలకు ఏం మేలు, న్యాయం చేస్తావో చెప్పే ప్రయత్నం చెయ్యి.. అని మంత్రి హితవు పలికారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించడంతోపాటు మరణించిన వారి ఓట్లు తొలగింపు వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఎన్నికలు, రీసర్వే, జగనన్న సురక్ష, గృహనిర్మాణం అంశాలపై సమీక్షించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు నమోదైతే తప్పుగా నమోదైన వాటిని వెంటనే తొలగించాలన్నారు. రీ సర్వేపై సమీక్షిస్తూ ఇప్పటివరకు 90 ఓఆర్‌ఐలను పూర్తి చేశామని, మిగిలిన గ్రామాల్లో నెలాఖరులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. జగనన్న సురక్ష క్యాంపుల లక్ష్యం కచ్చితంగా నెరవేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జగనన్న లేఅవుట్లలో కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు అక్కాబత్తుల లక్ష్మణ్ (26)

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని యడ్లగూడెం గ్రామానికి చెందిన అక్కాబత్తుల లక్ష్మణ్(26) అనే యువకుడు ఆరికిరేవుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం ఉదయం పోలవరంలో ఇంటి వద్ద నుంచి బయలుదేరి బుల్లెట్‌పై రాజమండ్రి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల వద్ద బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు, మిత్రులు హుటాహుటిన కొవ్వూరు ఆసుపత్రికి చేరుకున్నారు. లక్ష్మణ్ పోలవరంలో ఓ ప్రైవేట్ పార్శిల్ సరీ్వసులో పనిచేస్తున్నాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి విగతజీవుడిగా మారడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

శ్రీవారి కొండపై బైక్ చోరీ

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై ఒక భక్తుడి బైక్ శుక్రవారం చోరీకి గురైంది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై టి.సుదీర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన ఆకెళ్ల సతీష్ తన బైక్‌పై ద్వారకాతిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నాడు. అనంతరం వకుళ మాత అన్నదాన భవనం వద్ద బైక్‌ను పార్క్ చేసి, భోజనానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేదు. దాంతో వాహనం చోరీకి గురైనట్టు తెలుసుకున్న సతీష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ గొప్ప నిర్ణయం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకులో రాష్ట్ర మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు

తణుకు టౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న గొప్ప నిర్ణయమని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ నేపథ్యంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇచ్చిన వినతి పత్రాలను దృష్టిలో ఉంచుకుని వాటిని నెరవేరుస్తున్నారని చెప్పారు. గతంలో అనేక మంది నాయకులు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చినప్పటికీ అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఒక క్యాలెండర్ రూపంలో అమలు చేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులు అడగకుండా పీఆర్‌సీ నియమించారని, అడగకుండానే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఎన్ని సార్లు ఢిల్లీకి వెళ్లినా రాష్ట్ర ప్రయోజనాలు, ఉద్యోగుల ప్రయోజనాల కోసమే అన్నారు.

విద్యా రంగానికి రూ. 67 వేల కోట్ల ఖర్చు

తన ఢిల్లీ పర్యటనలో సివిల్ సప్లయిస్‌కు సంబంధించిన రూ.1702 కోట్ల బకాయిలు చెల్లించేందుకు మంత్రి పియూష్ గోయల్ అంగీకరించారని చెప్పారు. గతంలో చంద్రబాబు పాలనలో రాష్ట్రాన్ని, వ్యవస్థలను అస్తవ్యస్తం చేసి పసుపు కుంకుమ కోసం రూ.4 వేల కోట్లు, సివిల్ సప్లయిస్‌కు సంబంధించి రూ. 20 వేల కోట్లు అప్పులు చేయగా.. ఈ ప్రభుత్వం తీర్చినట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం, రాబోయే తరాల కోసం సీఎం జగన్ పాటుపడుతున్నారని చెప్పారు. అందుకే రూ. 67 వేల కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించి నాడు-నేడులో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారని చెప్పారు. గతంలో విద్యా రంగంలో మన రాష్ట్రం 15వ స్థానంలో ఉండగా నేడు దేశంలోనే 2వ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి, కోశాధికారి పీ శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్ హరినాథ్, తణుకు శాఖ అధ్యక్షుడు కేఎస్‌వీ నరసరాజు, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు వైవీఎస్‌బీ రాయుడు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు, కార్యదర్శి వెలగల తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లే సైకోలు

తణుకు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూడలేక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు సైకోలుగా మారారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, ప్రయోజనాల కోసమే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన చేశారని చెప్పారు. ముఖ్యమంత్రిని సైకో అనే చంద్రబాబు, లోకేష్‌లే నిజమైన సైకోలని అన్నారు. గతంలో ప్రజలకు 650 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి చంద్రబాబు తొలగించారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో సొమ్ములు జమ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు గొప్ప మేలు



వివిధ ప్రభుత్వ శాఖలలో ఐదు సంవత్సరాలకు మించి పని చేస్తున్న పది వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం అనేది చాలా సాహసోపేతమైన నిర్ణయం. తెలంగాణ ప్రభుత్వం పది సంవత్సరాల కాలం పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే పర్మినెంట్ చేయగా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 2014 నాటికి ఐదేళ్ల పూర్తి చేసిన వారినందరిని పర్మినెంట్ చేయాలని నిర్ణయించడం అభినందనీయం, ఉద్యోగులకు సంబంధించి ఎలాంటి నిరసనలు తెలియజేయకుండానే ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఆర్‌సీని నియమించారు. ఆర్‌టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే. లక్షా 30 వేల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను నియమించడం ద్వారా విడిపోయిన రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిన దూర దృష్టి గల నాయకుడుగా ముఖ్యమంత్రి జగన్ నిలిచిపోయారు. మిగిలిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేయాలి. ఎన్నికల్లోపు పీఆర్సీ ప్రకటించాలి.. లేదా ఐఆర్‌ను ప్రకటించాలి.

–బండి శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

23 ఏళ్ల కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో 23 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల కల నెరవేంది. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థను తీసుకొచ్చిన చంద్రబాబు నాయుడు ప్రతి ఎన్నికలలోనూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా హామీలను అమలు చేసి కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం నింపారు.

–ఏ మోహన్, ఏపీ ఎన్జీవో ఫార్మాసిస్ట్ అసోసియేషన్ నాయకుడు

చంద్రబాబు మోసగిస్తే జగన్ కరుణించారు



కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థ అమలుకు కారకుడైన చంద్రబాబు నాయుడు ప్రతి ఎన్నికల సమయంలోనూ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేస్తే ముఖ్యమంత్రి వైస్ జగన్ మాత్రం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేశారు. జూనియర్ లెక్చరర్లకు ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చి మాట తప్పకుండా హామీలను అమలు చేసి జూనియర్ లెక్చరర్ల కుటుంబాలలో ఆనందాలు నింపారు.

– శ్యాంబాబు, జూనియర్ లెక్చరర్స్ యూనియన్ నాయకుడు

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్



పెదపాడు మండలంలోని సత్యవోలులో కోళ్ల వ్యర్థాల వ్యాన్ పట్టుకున్న పోలీసులు

పెదపాడు: కొణికి వైపు నుంచి పెదపాడుకు వస్తున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొణికి వైపు నుంచి కోళ్ల వ్యర్థాలతో వ్యాన్ పెదపాడుకు వస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసి అడ్డుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కోళ్ల వ్యర్థాలను పూడ్చివేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాళ్ల: కాళ్ల మండలం ఏలూరుపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు కాళ్ల పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కలిదిండి గ్రామంలో ఉంటున్న నాగ శంకర్ గణేష్ ఒక బీమా కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు కలిదిండి నుంచి భీమవరం వెళ్లి వస్తూ వస్తాడు. ఈ క్రమంలో 30న భీమవరం నుంచి డ్యూటీ ముగించుకుని తిరిగి వెళుతుండగా కాళ్ల మండలం ఏలూరుపాడు సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గణేష్ భార్య స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: మండలంలోని రాజులపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్‌ఈబీ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 3 సెల్‌ఫోన్‌లు, రూ.53,530 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గీతాకృష్ణ తెలిపారు.

శ్రీవారి క్షేత్రానికి చేరుకున్న ప్రదక్షిణ పాదయాత్ర



శ్రీవారి పాదాలు



శ్రీవారి పాదాలతో చినవెంకన్న ఆలయానికి చేరుకున్న భోగిగణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు రమణరాజు

ద్వారకాతిరుమల: తిరుమల తిరుపతి నుంచి శ్రీవారి పాదాలతో కాకినాడకు ప్రదక్షిణ పాదయాత్రగా వెళుతున్న భోగిగణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు స్వామి శుక్రవారం ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అందించిన స్వామివారి పాదాలకు చినవెంకన్న ఆలయ ఆవరణలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి రాజమండ్రికి పయనమయ్యారు. ఈ సందర్భంగా రమణరాజు స్వామి మాట్లాడుతూ కాకినాడ స్వయంభూ భోగిగణపతికి కవచ యజ్ఞం చేపట్టిన కార్యాచరణలో భాగంగా తిరుమల తిరుపతికి వెళ్లి, స్వామివారి పాదాలతో తిరిగి వస్తున్నట్టు తెలిపారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన సహితంగా పీఠం నిర్వహణ జరుగుతుందన్నారు. శ్రీవారి పాదాల ప్రతిష్ఠాపన, కోల సంబరం, నిత్యాన్నదాన కార్యక్రమాలు రాబోయే శ్రీ దేవి నవరాత్రుల్లో జరుగుతాయన్నారు. 161 రోజుల గోవింద దీక్షలో 38వ రోజు పాదయాత్ర జరుగుతోందని తెలిపారు. ఈ యాత్ర ద్వారపూడి, బిక్కవోలు, పెద్దాపురం మీదుగా కాకినాడకు చేరుతుందన్నారు.

ముమ్మరంగా సార్వా నారుమళ్ల పనులు

- ఇప్పటికే 5,732 ఎకరాల్లో నారుమళ్లు పూర్తి
- జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో వరి సాగు



వీరవాసరం మండలం తోకలపూడిలో వేసిన సార్వా నారుమడి దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో సార్వా నారుమళ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత దాళ్వా పంట ఆశాజనకంగా పండటంలో రైతులు సార్వాపై ప్రత్యేక దృష్టిసారించారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలవడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండడంతో సాగుపై దృష్టిపెట్టారు. జిల్లా ప్రస్తుత సార్వా సీజన్‌లో సుమారు 2.15 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి సుమారు లక్షన్నర ఎకరాలకు సరిపడే 5,732 ఎకరాల్లో నారుమళ్లు పూర్తయ్యాయి. గత ఏడాది సార్వా పంట నారుమళ్ల సమయంలో అధిక వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడడంతో కొంతమంది రైతులు సెప్టెంబర్ నెలలో సైతం నాట్లు వేయగా ప్రస్తుత సీజన్‌లో ఆగస్టు రెండవ వారం నాటికే నాట్లు పూర్తి అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. దీని కారణంగా పంట కూడా ఇబ్బందులులేకుండా రైతుల చేతికి వస్తుందని చెబుతున్నారు.

ఎంటీయూ 1121, ఎంటీయూ 1318 రకంపైనే మక్కువ

జిల్లాలోని రైతులు ప్రస్తుత సీజన్‌లో ఎక్కువగా ఎంటీయూ 1121, ఎంటీయూ 1318 రకాలపై మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే నారుమళ్లు వేసిన రైతులు ఈ రెండు రకాలను వేయగా ఆలస్యంగా నారుమళ్లు వేసే రైతులు ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలను నాట్లు వేసుకోవడం వల్ల పంట తక్కువ కాలంలో చేతికి వస్తుందని వ్యవసాయశాఖాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తాడేపల్లిగూడెంలో రైతులు ఇప్పటికే 4 వేల ఎకరాల్లో నాట్లు పూర్తిచేయగా గణపవరం మండలంలో 100 ఎకరాల వరకూ నాట్లు వేశారు. మిలిగిన చోట్ల వారం రోజుల్లో నాట్లు ప్రారంభమయ్యే అవకాశముంది.

సమృద్ధిగా ఎరువుల నిల్వలు

జిల్లాలోని వరి పంటకు ప్రస్తుత సార్వా సీజన్‌కు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 53 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద దాదాపు 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. మిలిగిన ఎరువులను అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు సరఫరా చేయడానికి సిద్ధం చేశారు.


రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



జిల్లాలో ప్రస్తుత సార్వా సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. అవసరమైన రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నాం. అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద సిద్ధంగా ఉంచాం. ఆలస్యంగా నారుమళ్లు వేసే రైతులు తొందరగా పంట చేతికి వచ్చే ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలను ఎంపిక చేసుకోవాలి.

జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు



ఉండిలో నిర్వహించిన మండలస్థాయి సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ తదితరులు

ఉండి: ఉండి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండలస్థాయి సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. ఈ సభలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన పలు ఫిర్యాదులు, సూచనలపై సమావేశంలో చర్చించారు.ముఖ్యమంగా వెలివర్రు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలంటూ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు డ్వామా ఎంక్వైయిరీ వేస్తున్నట్లు పీడీ ఎం.రాజేశ్వరరావు తెలిపారు. అలాగే పాందువ్వ, ఆరేడు గ్రామాలకు చెందిన ఫీల్డు అసిస్టెంట్‌లను తొలగించాలని సామాజిక తనిఖీ బృందం నిర్ధారించడంతో ఆయా గ్రామ పంచాయితీలు ఫీల్డు అసిస్టెంట్‌ల మార్పుకు సమ్మతిస్తే మార్చుకోవచ్చునంటూ పీడీ ఆదేశించారు. ఉండి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులపై గత ఏడాది అవకతవకలపై ఎంక్వయిరీ చేసి రీ ఆడిట్ చేయాలని అధికారులు ఆదేశించినా సోషల్ అడిట్ బృందం రీఆడిట్ చేయకపోవడంపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేసారు. దీనిపై వెంటనే రీ-ఆడిట్ చేయాలని ఆదేశిస్తున్నట్లు పీడీ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు గాని, అధికారులు గాని ఎలాంటి అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే సహించేది లేదని పీడీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ,రణస్తుల మహంకాళి, ఎస్‌ఆర్‌పీ ఈ పున్నపునాయుడు, టీఏ టీ ఓమెగారాజు,వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: మండలంలోని బి.కొండేపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్: తణుకు 13వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి

శ్రీవారి కొండపై ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్



శ్రీవారి కొండపైన చెక్ పాయింట్లు పరిశీలిస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం నిషేధంపై వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, దేవాదాయశాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు సంకల్పించారు. అందులో భాగంగా ఆలయ పరిసరాల్లోని పలు దుకాణాలను అధికారుల బృందం తనిఖీ చేసి, పొగాకు ఉత్పత్తులు ఏవైనా అమ్మితే చట్టపరమైన చర్యలు చేపడతామని వ్యాపారులను హెచ్చరించారు. అలాగే చెక్ పాయింట్స్‌ను సందర్శించి అక్కడ టొబాకో కాల్చిన అనవాళ్లు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం ఆలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలనిచ్చారు. కార్యక్రమంలో డీసీఎం ఎస్.వెంకట్, గణేష్, ఆలయ సూపరింటిండెంట్ రమణరాజు, వాసు తదితరులున్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



కశింకోట వద్ద బోల్తాపడిన ఆర్టీసీ బస్సు



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

- జంగారెడ్డిగూడెం నుంచి విశాఖ వెళ్తుండగా ప్రమాదం
- నలుగురికి గాయాలు

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు, మరో ప్రయాణికుడు, బస్సు డ్రైవర్ ఉన్నారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు విశాఖపట్నం వస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం అంటిపేట గ్రామానికి చెందిన బక్కు గౌరీశ్వరి, విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదసామాలపల్లి గ్రామానికి చెందిన జరజాపు సావిత్రి, జంగారెడ్డిగూడెంకు చెందిన కేతిరెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో డ్రైవర్ బుక్కా శ్రీనివాసరావు బస్సు కేబిన్‌లో చిక్కుకోవడంతో స్థానికులు బయటకు తీశారు. క్షతగాత్రులను హైవే పోలీసుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. సురక్షితంగా బయటపడిన 26 మందిని వేరే బస్సులో గమ్యాలకు తరలించారు. బస్సు ముందు భాగం దెబ్బతింది. క్రేన్ సహాయంతో స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

శాకంబరీ అమ్మవారిగా కొండాలమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రామ దేవత కొండాలమ్మ తల్లి శుక్రవారం ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తాం



తణుకులో విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు అన్ని విధాలా కృషిచేస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కావాల్సిన సౌకర్యాలను నేరుగా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నత్తా కృష్ణవేణి, పొట్ల సురేష్, జంగం ఆనంద్‌కుమార్, మురాల సుధాకర్, పెరుమాల రాజేష్, గంజి సతీష్, కుడుపూడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

తణుకు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం తణుకు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. 11 గంటలకు ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి పేదలకు దుప్పట్లు పంపిణీ, మధ్యాహ్నం 12 గంటలకు తణుకు సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమాల్లో మంత్రి కారుమూరి స్వయంగా పాల్గొంటారని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలి

తాడేపల్లిగూడెం రూరల్: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధించాలని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని నీలాద్రిపురం పంచాయతీ పరిధి కృష్ణాపురం, కొత్తూరు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 29వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీవైఈవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ బడి.. సౌకర్యాల ఒడి



ఇరగవరంలో అమ్మ ఒడి చెక్కును అందజేస్తున్న మంత్రి కారుమూరి



అత్తిలిలో అమ్మ ఒడి కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

ఇరగవరం: పేద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన ఉన్నత విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరగవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో అమ్మ ఒడి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపడమే బాధ్యతగా తీసుకుంటే చాలు.మిగిలిన సౌకర్యాలన్నీ ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా రూ.15లు అందజేస్తున్నామన్నారు. మనబడి నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు ఉన్నతస్థాయి ప్రమాణాలను అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబంలో అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా, చిన్నారులకు మావయ్యగా పెనవేసుకుపోయిన వ్యక్తి సీఎం జగన్ అని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సీఎం జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం జగన్‌కు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగతాయారు, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ సుబ్బరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమమే లక్ష్యం



కొండేపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం బి.కొండేపాడులో గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ముందుగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందన్నారు. గత ప్రభుత్వం టీడీపీ పాలనలో రైతులు, మహిళలు తీవ్రంగా నష్టపోయారని ఆ పాలన చీకటి మయమని ఆరోపించారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతూ గ్రామాల అభివృద్ధి నే మరిచారన్నారు. అభివృద్ధి చేసిన పార్టీగా వైఎస్సార్ పార్టీకి ఓట్లు అడిగే అర్హత ఉందన్నారు. జగనన్న అభివృద్ధికి మరో సారి ప్రజలు పట్టం కడతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా దాన య్య, ఎంపీటీసీ సభ్యులు దేవర శెట్టి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి, సొసైటీ నాయకులు దేవరశెట్టి రాంబాబు. పార్టీ నాయకులు మర్రే కృష్ణమూర్తి వర్రే శివరామకృష్ణ, పంపన రాంబాబు, గూడూరి సూర్యనారాయణ, కార్యదర్శి శ్రీ రంగ, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస రావు, ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మార్ల పూడి సరోజని, గుండు మోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, కోరిమిల్లి సొసైటీ అధ్యక్షుడు చుండూరి సర్వేశ్వరరావు, చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లా లింగమూర్తి, పబ్బా రామారావు, చల్లా కుమారస్వామి, రావిపాడు సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ, వల్లూరి బ్రహ్మానందం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి



తణుకు 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 13వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణలో ప్రజలంతా ఎదురొచ్చి మరీ ముఖ్యమంత్రిగా మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకుంటామని చెబుతుంటే ఆయన కొలువులో మంత్రిగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా అందిస్తున్న వైనాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి వర్గాలు అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెనతోపాటు జగనన్న గోరుముద్ద కార్యక్రమాలు అమలవుతున్న తీరుపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నత్తా కృష్ణవేణి, మురాల సుధాకర్, పెరుమాల రాజేష్, పొట్ల సురేష్, జంగం ఆనంద్ కుమార్, యిండుగపల్లి బలరామకృష్ణ నూకల కనకదుర్గ, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా పట్టణంలోని క్లబ్ హాల్‌లో శుక్రవారం పేద విద్యార్థికి విద్య నిమిత్తం రూ. 5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, వంగపండు రామ మోహన్, చెన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రామచంద్రపురంలో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శనివారం సాయంత్రం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లా లింగమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొనే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని కోరారు.

బలుసులమ్మ ఆలయం వద్ద భారీ అన్నసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాఢ మాసం సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమా రాధన నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయంలో విశేష పూజ లు జరిగాయి. ఆలయకమిటీ చైర్మ న్ కొట్టు అంజిబాబు, సభ్యులు వట్టిప్రోలు రాము, పెదప్రోలు భాస్కర్ తదితరులు పర్యవేక్షించా రు. అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.